సమస్యలుంటే సాక్షికి చెప్పండి

మీ సమస్యలు, ప్రజోపయోగ సూచనలు, ఇతర అంశాలను కింద ఫోన్ నంబర్‌కు వాట్సాప్ చేయండి

98490 98674

నంబర్‌ను సంప్రదించండి

క్లుప్తంగా

క్రీడా పోటీల్లో ఉక్కు కేవీ విద్యార్థుల ప్రతిభ



విద్యార్థి సాయిప్రార్థనను అభినందిస్తున్న ప్రిన్సిపాల్ వంశీకృష్ణ

ఉక్కునగరం: కేంద్రీయ విద్యాలయాల జాతీయ స్థాయి క్రీడా పోటీల్లో స్టీల్‌ప్లాంట్ కేవీ విద్యార్థులు ప్రతిభ కనబరిచి పతకాలు సాధించారు. ఇటీవల హర్యానాలోని అంబాలా, కేరళలోని తిరువనంతపురంలో జరిగి జరిగిన అండర్–17 బాలబాలికల వాలీబాల్ పోటీల్లో పాఠశాల విద్యార్థిని సి. సాయి ప్రార్థన ప్రతిభ కనబరిచి స్వర్ణ పతకంతో పాటు రూ. 5 వేల నగదు బహుమతి గెలుపొందింది. అదే విధంగా అథ్లెటిక్స్ 400,100 మీటర్ల రిలే పోటీల్లో కార్తికేయ సాయి రజత పతకంతో పాటు రూ. 3 వేల నగదు బహుమతి సాధించాడు. ఈ సందర్భంగా మంగళవారం పాఠశాలలోవిజేతలను ప్రిన్సిపాల్ వంశీకృష్ణ, పీఈటీ సత్యనారాయణ అభినందించారు.

రేపు విద్యుత్ ఉండని ప్రాంతాలు

గాజువాక: చినగంట్యాడ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని చినగంట్యాడ, చైతన్యనగర్, శ్రామికనగర్ ఫీడర్లలో ఈనెల 31న నిర్వహణ పనులు చేపట్టనున్నట్టు ఈపీడీసీఎల్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి.కె.నాయుడు తెలిపారు. ఈ కారణంగా గాజువాక కోర్టు కాంప్లెక్స్, చినగంట్యాడ, వందడుగుల రోడ్‌లోని ప్రభుత్వ కార్యాలయాలు, ఆర్‌కే ఆస్పత్రి ఏరియా, ఎస్సీ కాలనీ, శ్రామికనగర్ ఏరియా, దత్తసాయినగర్, శ్రీనివాసనగర్ ప్రాంతాల్లో గురువారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

ప్రతీ మంగళవారం అనాథలకు భోజనం




అనాథలకు భోజన వసతిని ప్రారంభిస్తున్న అతిథులు

అగనంపూడి: శ్రీ బొర్రమాంబ పారాయణ సేవా సమితి సహకారంతో ప్రతీ మంగళవారం అనాథలకు భోజన వసతి కల్పించనున్నామని పారాయణ సేవా సమితి నిర్వాహకుడు చిత్తా రామారావు చెప్పారు. పారాయణ సేవా సమితి ప్రతినిధుల్లో శుభకార్యాలు, పుట్టిన రోజులు ఇతర సందర్భాలను పురస్కరించుకొని ప్రతీ మంగళవారం ఆ కార్యక్రమం చేపట్టడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో ప్రజా సంఘాల నాయకులు చిత్తా గణేష్, కరణం పైడిరాజు, జి.పూర్ణానందశర్మ (పూర్ణ), గళ్లరాజు, కొయ్య భాస్కర్‌రెడ్డి, కోసూరి తాతారావు, కిడిమి హనుమంతురావు, చిత్తా జానకీదేవి, శోభారాణి, తలారి లలిత కుమారి, రామలక్ష్మి పాల్గొన్నారు.

1న మెగా రక్తదాన శిబిరం

పెదగంట్యాడ: స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకుని మహాత్మా మదర్ థెరిసా చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పెదకోరాడ జంక్షన్‌లో ఆగస్టు 1న నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరాన్ని విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. పెదకోరాడ జంక్షన్‌లో మంగళవారం శిబిరానికి సంబంధించిన పోస్టర్ ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ పెద్ద సంఖ్యలో యువత పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో ట్రస్ట్ అధ్యక్షుడు జాగరపు శ్రీను, ప్రసాదుల శ్రీనివాసరావు, నమ్మి సింహాద్రి, ఎస్ అనంత్, వినోద్ బాలు తదితరులు పాల్గొన్నారు

కాంట్రాక్ట్ కార్మికుడి మృతి



రామారావు మృతదేహం

ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ స్టీల్ మెల్ట్ షాప్ విభాగంలో కాంట్రాక్ట్ కార్మికుడు మృతి చెందాడు. కార్మిక నాయకులు అందించిన వివరాలివి.. పెదగంట్యాడ అంబేడ్కర్ నగర్‌కు చెందిన పుచ్చల రామారావు (49) సీసీడీ సెక్షన్‌లో కాంట్రాక్ట్ కార్మికుడిగా పని చేస్తున్నారు. మంగళవారం యధావిధిగా విధులు నిర్వహిస్తుండగా అతనికి వాంతులు అయ్యాయి. వెంటనే అతన్ని మెయిన్ గేటు సమీప ప్రాథమిక చికిత్స కేంద్రానికి తీసుకు వెళ్లగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. అక్కడ నుంచి మృతదేహాన్ని ఉక్కు జనరల్ ఆస్పత్రికి తరలించారు. ఈ విషయం తెలిసిన కుటుంబీకులు విలపించారు. అయితే సంబంధిత కాంట్రాక్టర్ పరామర్శించక పోవడంతో కార్మిక వర్గాలు ఆగ్రహం వ్యక్తం చేశాయి. మృతుడి కుటుంబీలను ఆదుకోవాలని వారు డిమాండ్ చేశారు.

పిచ్చిమొక్కలు.. చెత్తకుప్పలు



పిచ్చిమొక్కలతో నిండిపోయిన ఆర్టీసీ,పోస్టాఫీస్‌కు కేటాయించిన స్థలాలు



ఆర్టీసీ స్థలంలో చెత్తకుప్పలు

ప్రజావసరాలు, పట్టణాల అభివృద్ధికోసం కేటాయించిన ప్రభుత్వ స్థలాలు అందుకు భిన్నంగా వినియోగం అవుతున్నాయి. పాలకులు, ప్రభుత్వ అధికారులు పట్టనట్టు వ్యవహరించడంతో విలువైన స్థలాలు సైతం డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. మరికొన్ని స్థలాలు ఆక్రమణకు గురవుతున్నాయి. దీంతో వాటి పరిసర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు పడరాని పాట్లు పడుతున్నారు. ఇందుకు జీవీఎంసీ 86వ వార్డు రాజీవ్‌నగర్‌లో ప్రభుత్వ సంస్థలకు కేటాయించిన స్థలాలే నిదర్శనంగా చెప్పుకోవచ్చు. – కూర్మన్నపాలెం

- నిరుపయోగంగా ఆర్టీసీ, పోస్టల్ శాఖ భూములు
- ముక్కుపుటాలు అదిరిపోయే దుర్వాసన
- పట్టించుకోని ఆర్టీసీ, పోస్టల్ అధికారులు
- ఇబ్బంది పడుతున్న పరిసర ప్రాంత వాసులు

గాజువాక పట్టణంగా రూపాంతరం చెందకముందే 1987లో విశాఖ నగరాభివృద్ధి సంస్థ (వుడా) కూర్మన్నపాలెం ప్రాంతంలో కాలనీలు నిర్మించాలని యోచించింది. దీనిలో భాగంగా రాజీవ్‌నగర్‌ను నిర్మించింది. ఈ కాలనీ నిర్మించిన సమయంలోనే అప్పటి అధికారులు ప్రజలకు తగిన రవాణా సౌకర్యం కోసం ముందుచూపుతో ఆలోచన చేశారు. అందుకు అనుగుణంగానే రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్.టి.సి)కి సుమారు ఐదు ఎకరాల స్థలం కేటాయించారు.అలాగే మరికొంత స్థలాన్ని పోస్టాఫీసు కోసం వదిలిపెట్టారు. ఆ స్థలాలను ఆయా సంస్థలు వినియోగించుకొని ప్రజలకు అందుబాటులోకి ప్రభుత్వసేవలు తీసుకురావాలని ఆలోచించారు. అధికారుల ఉద్దేశం మంచిదే అయినప్పటికీ తర్వాత వచ్చిన ఆ సంగతే మరచిపోయారు. ఆ స్థలాన్ని అలాగే గాలికి వదిలేశారు. ఇప్పుడు ఆ కాలనీల్లో ఖరీదైన భవనాలు వెలిశాయి. అక్కడ భూముల రేట్లు విపరీతంగా పెరిగి పోయాయి. ఎంతో మంది వ్యాపారులు, ఉన్నత స్థాయిలో ఉద్యోగాలు చేసినవారు పదవీ విరమణ పొందిన వారు ఎంతమంది అక్కడకి వచ్చి విలాసవంతమైన భవనాలు నిర్మించుకున్నారు. విలువైన ప్రాంతంలో ఇప్పుడు ఆ స్థలాలు ఉన్నాయి.

ఆక్రమణల బెడద

దీనికి తోడు చిరు వ్యాపారులు ఆర్టీసీ స్థలంలో చిన్నచిన్న బడ్డీలు ఏర్పాటు చేశారు. వీటి వల్ల రాత్రివేళల్లో పలు సమస్యలు తలెత్తుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇక పోస్టాఫీస్ విషయానికి వస్తే సొంత స్థలం ఉన్నప్పటికీ 40 సంవత్సరాలుగా అద్దె భవనాల్లోనే నిర్వహిస్తున్నారు. ఇప్పటికీ రూ. 29వేల అద్దె చెల్లించి ఎవరికీ తెలియని మారుమూల ప్రాంతంలో తపాలా కార్యాలయం నిర్వహిస్తున్నారు. ఇలా విలువైన స్థలాలను గాలికి వదిలేయడంతో ఆక్రమణదారులు వాటిపై కన్నేశారు. చిరువ్యాపారాలు పేరుతో కొంతమంది ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు ఆ స్థలాలను కాపాడి ప్రజలకు ఉపయోగపడేలా నిర్మాణాలు చేపట్టాలని కోరుతున్నారు.

దుర్వాసనతో అవస్థలు

విలువైన స్థలాలను అధికారులు పట్టించుకోకపోవడంతో అవి డంపింగ్ యార్డులుగా మారిపోతున్నాయి. ఎక్కడి నుంచో చెత్తాచెదారం తెచ్చి ఆస్థలాల్లో వేసేస్తున్నారు. దీంతో పందులు, కుక్కలు అక్కడే మకాం వేసి పరిసరాలను మరింత అపరిశుభ్రం చేస్తున్నాయి. దీనికి తోడు చెత్తాచెదారం కుళ్లిపోయి ముక్కుపుటాలు అదిరిపోయాలా దుర్వాసన వెదజల్లుతోంది.



వెలుస్తున్న చిరువ్యాపారుల గుడారాలు



చెత్తకుప్పల్లో సంచరిస్తున్న పందులు

భరించలేని దుర్వాసన



ప్రభుత్వం కేటాయించిన స్థలాలను ఆయా సంస్థలు వినియోగించుకోవాలి.సంవత్సరాల తరబడి నిరుపయోగంగా వదిలేయడం వల్ల ఆర్టీసీకి కేటాయించిన స్థలం డంపింగ్‌యార్డుగా మారింది. దీంతో పందులు చేరుతున్నాయి. చెత్తకుళ్లిపోయి దుర్వాసన భరించలేకపోతున్నాం. విలువైన స్థలం చేజారిపోకుండా అధికారులు చర్యలు చేపట్టాలి.

– పీకేఎం లక్ష్మి, విశ్రాంత ఉక్కు అధికారి, వుడానగర్

స్థలాలను అభివృద్ధి చేయాలి



విలువైన స్థలాలను అధికారులు పట్టించుకోకపోవడం ఆశ్చర్యం కలిగిస్తుంది. నిర్మాణాలు చేపట్టకపోయినా కనీసం స్థలాల చుట్టూ ప్రహరీ నిర్మించుకుంటే మంచిది. లేకుంటే ఆక్రమణకు గురయ్యే పరిస్థితి ఉంది. మరో వైపు నిర్వహణ లేక చెత్తాచెదారంతో పాటు పిచ్చిమొక్కలు పెరిగిపోయాయి. అధికారులు స్పందించి స్థలాలను స్వాధీనం చేసుకుని అభివృద్ధి చేయాలి.

ఎస్.రమేష్ రాసాలమ్మకాలనీ

వైద్యుల సూచన మేరకే మందులు వాడాలి



మాట్లాడుతున్న జిల్లా ఔషధ నియంత్రణ మండలి సహాయ సంచాలకుడు విజయ్‌కుమార్

అగనంపూడి: వైద్యుల సూచనల మేరకే యాంటీ బయోటిక్స్ వాడాలని జిల్లా ఔషధ నియంత్రణ మండలి సహాయ సంచాలకుడు ఎస్.విజయ్ కుమార్ అన్నారు. అగనంపూడి ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు మంళవారం యాంటీ బయోటిక్స్ వాడకంపై అవగాహన కల్పించారు. చిన్న చిన్న కారణాలతో అవసరానికి మించి మందులు వాడడం సరికాదన్నారు. వైద్యుల రాసిన చీటీ లేకుండా మందులు కొనడం, అమ్మడం నేరమన్నారు. ఎట్టి పరిస్థితుల్లో కూడా వైద్యుల సలహా మేరకు మాత్రమే మందులు వాడాలన్నారు. జలుబు, దగ్గు వంటి వాటికి కూడా యాంటీ బయాటిక్స్ వాడడం అలవాటు చేసుకుంటున్నారని, ఇది సరికాదన్నారు. ఔషధ నియంత్రణాధికారి ఎం.శ్రీనివాసరావు మాట్లాడుతూ వైద్యులు సూచించిన మందులను క్రమం తప్పకుండా కోర్సు మొత్తం వాడాలన్నారు. సురక్షితమైన ఆహారం, శుద్ధి నీటిని వీటనియోగించడం వల్ల ఇన్ఫెక్షన్లు నివారించవచ్చన్నారు. కార్యక్రమంలో ఔషధ నియంత్రాధికారులు వి.అభిప్రియ, కె.కల్యాణి, కె.వి.భారతి, ఎస్.కల్యాణి, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

కాలుష్యాన్ని నివారించాలని వినతి



ఎమ్మెల్యే శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేస్తున్న జేఏసీ ప్రతినిధులు

గాజువాక: గాజువాక నియోజకవర్గంలో పారిశ్రామిక కాలుష్య నివారణకు తగిన చర్యలు తీసుకోవాలని వైజాగ్ పోర్టు పొల్యూషన్ బాధిత గ్రామాల జాయింట్ యాక్షన్ కమిటీ (జేఏసీ) కోరింది. ఈ మేరకు ఆ కమిటీ ప్రతినిధులు, స్థానిక నాయకులు మంగళవారం ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావుకు వినతి పత్రం అందజేశారు. మింది, ములగాడ, అక్కిరెడ్డిపాలెం ప్రాంతాల్లో గాలి, నీటి నాణ్యత దారుణంగా పడిపోయాయని, దీనివల్ల స్థానికులు అనేక ఆరోగ్య సమస్యలకు గురవుతున్నారని పేర్కొన్నారు. వివిధ పరిశ్రమల నుంచి నిరంతరంగా వెలువడుతున్న హానికర వ్యర్థాలు స్థానికుల జీవన ప్రమాణాలపై తీవ్ర ప్రభావం చూపుతున్నాయన్నారు. కాలుష్య ప్రభావిత గ్రామాల ప్రజల్లో శ్వాసకోశ సమస్యలు, చర్మ రుగ్మతలు, దీర్ఘకాలిక వ్యాధులు అధికమవుతున్నాయన్నారు. ఇలాంటి భయానక పరిస్థితుల్లో ఇక్కడి నివాస ప్రాంతాలకు 200 మీటర్ల దూరంలో సాన్వెరా గొడౌన్ ఏర్పాటుకు విశాఖపట్నం పోర్టు ట్రస్టు అనుమతి ఇచ్చిందని, ఇది తమ ప్రాంత ప్రజలను తీవ్ర కలవరానికి గురిచేస్తోందని వివరించారు. ఆ ప్రాంతంలో ఉద్యానవనం లేదా బొటానికల్ గార్డెన్‌ఏర్పాటు చేయాలని కోరారు. వినతి పత్రం సమర్పించినవారిలో కార్పొరేటర్ గుడివాడ అనూష, జేఏసీ ప్రతినిధులు, నాయకులు పి.చిన్నారావు, ఎస్.అనంత లక్ష్మి, జి.లక్ష్మీనర్సింహ మూర్తి, ఎ.మురళీకృష్ణ, ఎ.కె.పాత్రో, విశ్వనాథం, వై.రామ్మోహన్, యజ్జి నారాయణ తదితరులు ఉన్నారు.

పూడిక తీశారు.. వదిలేశారు

వాహనచోదకుల అవస్థలు



స్టీల్‌ప్లాంట్ బీసీ గేటుకు వెళ్లే రోడ్డులో వేసిన చెత్తకుప్పలు

పెదగంట్యాడ: అధికారుల నిర్లక్ష్యం వాహన చోదకులకు ప్రాణ సంకటంగా మారింది. గెడ్డలో నుంచి తీసిన చెత్తను రోడ్డుపై పడేయడంతో అవస్థలు పడుతున్నారు. పెదగంట్యాడ ప్రధాన రహదారి బీసీ రోడ్డు నుంచి గంగవరం పోర్టు వంతెనపై నుంచి వెళ్లే రహదారిలో గెడ్డలోని పూడికలను ఇటీవల తొలగించారు. అయితే తీసిన పూడికను రోడ్డుపై వదిలేశారు. దీంతో అటుగా రాకపోకలు సాగిస్తున్న స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నారు. గెడ్డలో నుంచి తీసిన చెత్త కారణంగా దుర్వాసన వస్తోందని, ముక్కు మూసుకుని రాకపోకలు సాగించాల్సిన దుస్థితి నెలకొని ఉందని చెబుతున్నారు. రాత్రి వేళల్లో రోడ్డుపై ఉన్న చెత్త కనిపించకపోవడంతో వాహనాలు అదుపు తప్పి గాయాలబారిన పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జీవీఎంసీ అధికారులు స్పందించి రోడ్డుపై పడేసిన చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని కోరుతున్నారు.

నూతన కార్యవర్గం ఎన్నిక

మహారాణిపేట: జిల్లా ప్రభుత్వ వాహనాల డ్రైవర్ల మ్యూచువల్ ఎయిడెడ్ హౌసింగ్ బిల్డింగ్ సొసైటీ నూతన కార్యవర్గ ఎన్నిక మంగళవారం జరిగింది. జిల్లా అధ్యక్షుడిగా దాసరి వెంకటరావు, అసోసియేట్ అధ్యక్షుడిగా ఎస్.రమణ, కోశాధికారిగా కె.ప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా ఎ.వి. శ్రీను ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గం మంగళవారం జిల్లా సహకార శాఖ అధికారిని మర్యాదపూర్వకంగా కలిసి కార్యవర్గ సభ్యులను పరిచయం చేసింది.

ఇష్టానుసారంగా స్పీడ్ బ్రేకర్లు

- రెండు కిలోమీటర్ల రోడ్డులో 36 ఏర్పాటు
- గాయాలపాలవుతున్న వాహనదారులు
- తొలగించాలని స్థానికుల డిమాండ్



ఇస్లాంపేట సమీపంలో ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు



ప్రమాణాలు పాటించకుండా వేసిన స్పీడ్ బ్రేకర్



50 మీటర్లు దాటకుండా పక్కపక్కనే ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు

పెదగంట్యాడ: వాహనాల వేగానికి కళ్లెం వేసేందుకు ఏర్పాటు చేసిన స్పీడ్‌బ్రేకర్లు (వేగనిరోధకాలు) ప్రమాదాలకు నిలయంగా మారుతున్నాయి. జీవీఎంసీ 77వ వార్డు పరిధి ఇస్లాంపేట సచివాలయం నుంచి మద్దివానిపాలెం వరకూ ఇటీవలే కొత్తగా సుమారు రెండు కిలోమీటర్ల రోడ్డు నిర్మించారు. అయితే అధికారులు నిర్లక్ష్యమో.. స్థానికులు ప్రోత్సహామో తెలియదు గాని నిబంధనలకు విరుద్ధంగా దారిపొడువునా సుమారు 36 వరకూ స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేశారు. ఈ స్పీడ్ బ్రేకర్లు ఇప్పుడు వాహనదారులకు శాపంగా మారింది. ప్రధానంగా రాత్రి పూట ఈ స్పీడ్ బ్రేకర్ల వద్ద వాహనాలు అదుపు తప్పి ప్రమాదాల బారిన పడుతున్నారు. అంతే కాకుండా ఎవరైనా కొత్తవారు ఈ మార్గంలో వస్తే అదుపు తప్పి గాయాలపాలవుతున్నారు.

నిబంధనలు పట్టవా?

స్పీడ్‌బ్రేకర్లు వాస్తవానికి స్కూల్‌జోన్ ప్రాంతాలు... రెండు లేదా నాలుగు లైన్ల ప్రధాన కూడళ్ల వద్ద, దేవాలయాలు, పాదచారులు రోడ్డు దాటేందుకు నిర్దేశించిన ప్రాంతాల సమీపంలో వాహనాలు వేగంగా రాకుండా నియంత్రించేందుకు స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేస్తారు. అది కూడా అధికారులు సమన్వయంతో ఏయే ప్రాంతాల్లో ఏ పరిమాణంలో వేయాలో నిర్ణయిస్తారు.. కానీ ఇక్కడ పరిస్థితి పూర్తిగా భిన్నంగా ఏర్పాటు చేశారు.

అధికారులు స్పందించాలి

వీధుల్లో స్పీడ్ బ్రేకర్లు రాకపోకలకు చాల ఇబ్బందికరంగా ఉంది.. రాత్రిపూట ఆరోగ్య పరిస్థితి బాగోలేని వారిని తీసుకుని గాజువాక వెళ్లాల్సి ఉంటుంది. ఆటోలు.. ద్విచక్ర వాహనాలపై వస్తున్నప్పుడు స్పీడ్ బ్రేకర్లు గుర్తించలేక అదుపు తప్పి కిందపడి గాయాలపాలవుతున్నాం. అనధికారికంగా ఇంత తక్కువ దూరంలో స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలి.. అలాగే స్పీడ్ బ్రేకర్లు తొలగించాలి.

– కె.అప్పలరాజు, నమ్మిదొడ్డి, పెదగంట్యాడ.

ఆటో ఢీకొని వృద్ధుడికి గాయాలు



గాయపడిన అలీ

ఉక్కునగరం: కణితి రహదారిలోని చెక్ పోస్ట్ వద్ద గూడ్స్ ఆటో ఢీకొనడంతో స్కూటీపై వెళ్తున్న వృద్ధుడికి తీవ్ర గాయాలయ్యాయి. స్టీల్‌ప్లాంట్ పోలీసులు అందించిన వివరాలివి.. ఇస్లాంపేట దరి చిన్నపాలేనికి చెందిన రంజాన్ అలీ విశ్రాంత సైనికుడు. మందుల కోసం రంజాన్ స్కూటీపై ఐఎస్ఎస్ కల్యాణి ఆస్పత్రికి బయల్దేరారు. స్టీల్‌ప్లాంట్ నుంచి గాజువాక వెళ్లే కణితి రహదారి చెక్‌పోస్ట్ వద్దకు చేరేసరికి వెనుక నుంచి వేగంగా వస్తున్న గూడ్స్ ఆటో స్కూటీని బలంగా ఢీకొట్టడంతో కింద పడిన అలీకి గాయాలయ్యాయి. గాజువాకలోని ప్రైవేటు ఆస్పత్రికి తరలించారు. స్టీల్‌ప్లాంట్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

స్టీల్‌ప్లాంట్ పోలీసులపై ఫిర్యాదు



మాట్లాడుతున్న రామ అప్పారావు

అగనంపూడి: స్టీల్‌ప్లాంట్ పోలీస్ స్టేషన్ అధికారుల తీరుపై సెంట్రల్ పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్ అండ్ మానటరింగ్ సిస్టమ్ ద్వారా ఫిర్యాదు చేసినట్టు అగనంపూడి నిర్వాసితకాలనీకి చెందిన సీతిన లక్ష్మి, వినియోగదారుల హక్కుల పరిరక్షణ వేదిక కన్వీనర్ పట్టా రామ అప్పారావు చెప్పారు. అగనంపూడిలో మంగళవారం విలేకరులతో వారు మాట్లాడారు. విశాఖ ఉక్కులో విధులు నిర్వహిస్తుండగా 2016లో తన భర్త సీతిన అచ్యుత రామచంద్రరావు మృతి చెందారని తెలిపారు. ఉక్కు అధికారులు ప్రమాద వశాత్తు కాదని బకాయిస్తూ తమ కుటుంబానికి రావాల్సిన నష్ట పరిహారం ఎగ్గొట్టారని వివరించారు. ఈవిషయాన్ని పట్టా రామ అప్పారావు జేసీఎల్ దృష్టికి తీసుకువెళ్లడంతో న్యాయం జరిగిందని సీతిన లక్ష్మి తెలిపారు. బీమాసంస్థ పరిహారం చెల్లించడానికి ముందుకు వచ్చినా స్టీల్‌ప్లాంట్ పోలీస్‌స్టేషన్ సిబ్బంది పూర్తి నివేదిక అందివ్వకపోవడంతో ఫిర్యాదు చేశామని వారు తెలిపారు. కార్యక్రమంలో త్రిమూర్తులు పాల్గొన్నారు.

పారదర్శకంగా సేవలందించాలి



డాక్టర్ రాధారాణికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

మహారాణిపేట: క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ (రిజిస్ట్రేషన్ అండ్ రెగ్యులేషన్) యాక్టు 2010ని జిల్లాలో పూర్తి స్థాయిలో అమలు చేయాలని, అన్ని ప్రభుత్వ, కార్పొరేట్ ఆస్పత్రుల్లో మెరుగైన సదుపాయాలు కల్పించాలని, ఆరోగ్య సేవలపై సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం చర్యలు తీసుకోవాలని కౌన్సిల్ ఫర్ సిటిజెన్ రైట్ కోరింది. మంగళవారం వైద్య ఆరోగ్యశాఖ ప్రాంతీయ డైరెక్టర్ డాక్టర్ రాధారాణికి కౌన్సిల్‌కు చెందిన కె.రాము వినతిపత్రం సమర్పించారు. ఆస్పత్రులు ప్రమాణాలు పాటించాలని, ప్రజలకు పారదర్శకమైన, నాణ్యమైన వైద్యసేవలు అందించాలనే లక్ష్యంతో క్లినికల్ ఎస్టాబ్లిష్‌మెంట్ యాక్టు 2010 రూపొందించారని రాము మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపారు. పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో తొలుత కార్యాలయం ముందు పోస్టర్ విడుదల చేసినట్లు పేర్కొన్నారు.

సాక్షి

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.

వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు

వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు

శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు

అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.

గాజువాక

9912222749, 9705347420, 9705933394

Office mail : sakshiadvtvsp@gmail.com